క్లుప్తంగా

'పశ్చిమ' నియోజకవర్గంలో 4 నామినేషన్ల దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి జామి పార్వతి

కంచరపాలెం: విశాఖ పశ్చిమ నియోజకవర్గం -24 జ్ఞానాపురం జోన్-5 జోనల్ కార్యాలయం ఎన్నికల విభాగంలో బుధవారం నాలుగు నామినేషన్లు దాఖలైనట్టు రిటర్నింగ్ అధికారి (ఆర్వో) హుస్సేన్ సాహెబ్ తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా ఆడారి ఆనంద్‌కుమార్ సోదరి పిల్లా రమాకుమారి ఒక సెట్, మరో స్వతంత్ర అభ్యర్థిగా జామి పార్వతి ఒక సెట్, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గణబాబు ఒక సెట్, గణబాబు కుమారుడు పెతకంశెట్టి మౌర్యసింహా రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటివరకు పశ్చిమ నియోజకవర్గంలో 11 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు.

స్తంభానికి టీడీపీ జెండా



సీసీ కెమెరాల ఏర్పాటు చేసిన స్తంభానికి కట్టిన టీడీపీ జెండా

గోపాలపట్నం: తెలుగుదేశంపార్టీ నాయకులు యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘిస్తున్నారు. గోపాలపట్నం పోలీస్ స్టేషన్ ఎదురుగా ఒక సీట్ కవర్లు కుట్టే దుకాణం వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు చేసిన స్తంభానికి టీడీపీ జెండానే కట్టారు. అంతా మాఇష్టం.. మాకు ఎదురు చెప్పేవారే లేరన్న విధంగా టీడీపీ నేతలు ప్రవర్తిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అప్పలరెడ్డి సేవలు చిరస్మరణీయం



అప్పలరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం : వైఎస్సార్‌సీపీకి దివంగత అప్పలరెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 61వ వార్డు రెడ్డివీధి ప్రాంతానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చుక్క అప్పలరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆడారి ఆనంద్ కుమార్ అప్పలరెడ్డి చిత్రపటాని కి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి పిల్ల లను ఓదార్చారు. అధైర్యపడొద్దని..తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకుడు భద్రినాథ్, 63వ వార్డు పార్టీ ఇన్‌చార్జ్ పిలక రామ్మోహన్ రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ పిల్లా కన్నబాబు, బూస అప్పలరెడ్డి, 61వ వార్డు పార్టీ అధ్యక్షుడు జీ.వీ.ఎస్.ఎన్.రాజు, బద్రిరెడ్డి, శంఖర్ పాల్గొన్నారు.

1,168వ రోజుకు ఉక్కు ఉద్యమం

గాజువాక: కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం ఆగదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1168వ రోజు, బుధవారం స్టీల్‌ప్లాంట్‌కు చెందిన పలువురు కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని రోల్ మోడల్ చేస్తా



ఎదురవానిపాలెం వద్ద ప్రచార కార్యక్రమంలో తోనంగి వెంకటరమణియాదవ్

వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్

విశాఖ విద్య: ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే, అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. 90వ వార్డు పరిధిలోని ఎన్ఏడీ కొత్తరోడ్డు, కాకానినగర్,వినోద్ నగర్, బుచ్చిరాజుపాలెం, ఏపీఎస్ఈబీ కాలనీ, సీతారామరాజు నగర్‌లో బుధవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఓపెన్ టాప్ జీపుపై పార్టీ నాయకులతో కలిసి ప్రజలందరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఇంటింటికీ తిరిగి ఓటు అభ్యర్థించారు. ఆనంద్‌కుమార్‌కు మహిళలు హారతులతో స్వాగతం పలికి, మేమంతా మీ వెంటే అంటూ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో నమ్మకంతో పశ్చిమ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం కల్పించారన్నారు. సమన్వయకర్తగా నియమితులైన నాటి నుంచి నాటి నుంచి అందరికీ అందుబాటులో ఉండి, ప్రభుత్వ పరంగా సంక్షేమపథకాలు అందించడమే కాకుండా, సొంత నిధులతో కూడా సాయం చేశానని గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే, ప్రజలందరి కష్ట సుఖాల్లో మరింతగా పాలుపంచుకునే అవకాశం లభిస్తుందన్నారు. నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు పేడాడ రమణి కుమారి, వార్డు నాయకులు నమ్మి శ్రీను, చుక్కా ప్రసాద రెడ్డి, జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు, ఆర్యవైశ్యకార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు, గొర్లె అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీ కృష్ణ, సీతారామరాజు నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస రాజు, పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో ఆనంద్ కుమార్



సమస్యలు తెలుసుకుంటున్న ఆనంద్ కుమార్

అందరివాడు ఆనంద్

మల్కాపురం : వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని పార్టీ మహిళ నాయకురాలు తోనంగి వెంకటరమణియాదవ్ అన్నారు.ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా 58వ వార్డు ఎదురవానిపాలెంలో బుధవారం మహిళలు, కార్యకర్తలతో కలిసి ఆడారి ఆనంద్‌కుమార్ గెలుపు కోరుతూ డోర్ టూ డోర్ ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పశ్చిమలో టీడీపీ ఎమ్మెల్యే గణబాబుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందన్నారు. ఓట్లేసి గెలిపించిన గణబాబు నియోజకవర్గ అభివృద్ధిని, ప్రజలను పూర్తిగా విస్మరిచారన్నారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అందరికీఅందుబాటులో ఉండే వ్యక్తని, పిలిస్తే పలికే నేత అన్నారు. అటువంటి మన ఆత్మీయుడ్ని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఒక్క అవకాశమివ్వండి

ఓటర్లకు ఆడారి సతీమణి మాలతి విజ్ఞప్తి



జయప్రకాష్‌నగర్‌లో చేపల దుకాణంలో మహిళతో మాట్లాడుతున్న ఆడారి మాలతి



మహిళకు బొట్టు పెట్టి ఓటు అభ్యర్థిస్తున్న మాలతి

గోపాలపట్నం: ఒక్క అవకాశమివ్వండి జీవితాంతం మీ కుటుంబ సభ్యులుగా ఉంటామని వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ సతీమణి ఆడారి మాలతి అన్నారు. బుధవారం ఉదయం, సాయంత్రం ఆమె 91వ వార్డు బాజి జంక్షన్ జయప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మహిళలకు బొట్టు పెడుతూ ఆప్యాయంగా మాట్లాడారు. అమ్మా బాగున్నారా... జగనన్న ప్రభుత్వంలో మీకు సంక్షేమ పథకాలు ఏవిధంగా అందుతున్నాయంటూ ఆరా తీశారు. మరిన్ని సంక్షేమ పథకాలు కావాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. అందరికీ ఆప్తుడు, అందుబాటులో ఉన్న ఆడారి ఆనంద్ కుమార్‌ను మీరంతా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఆడారి ఆనంద్ గెలుపుతోనే పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎంపీ అభ్యర్థిగా పశ్చిమ ఆడపడుచు బొత్స ఝాన్సీని, ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌ను గెలిపించాలని కోరారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గుణిశెట్టి శ్రీనివాసరావు, 92వార్డు, అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీ కృష్ణ, వార్డు నాయకులు, కన్వీనర్లు గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ముఖ్యమంత్రి జగనన్నే..

వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్



హాజరైన ప్రజలు



పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం : సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. 59వ వార్డు ప్రాంత నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇండ్రస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆడారి ఆనంద్ అతిథిగా పాల్గొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలే నేడు ఆయనకు ఆశీర్వచనాలుగా మారాయన్నారు. ఆయన ఎన్నికల ప్రచారానికి ఏ ప్రాంతానికి వెళ్తున్న ప్రజలు నీరాజనం పలుకుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ ఎన్నికల పరిశీలకులు పీలా ఉమారాణి, పార్టీ సీనియర్ నాయకులు ఎం.పెంటారావు, అప్పారావుయాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డు పరిధి నక్కవానిపాలెం, వాయుపత్రకాలనీ ప్రాంతాలకు చెందిన పలువురు యువత, మహిళలు పార్టీ లో చేరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపట్నం : గోపాలపట్నం పరిసర ప్రాంతాలైన నరసింహనగర్ ఫీడర్, ఇందిరానగర్ ఫీడర్, చంద్రానగర్ ఫీడర్ ఏపీఎస్ఈబీ కాలనీ ఫీడర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పోలాయి శ్రీనివాసరావు తెలిపారు. గోపాలపట్నం బంక్ ఏరియా, ఇందిరా నగర్, నరసింహనగర్, గణేష్ నగర్, గోపాలపట్నం మెయిన్ రోడ్డు ,లక్ష్మీనగర్, సుసర్ల కాలనీ, లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్, ఏపీఏసీబీ కాలనీ, సీతారామరాజునగర్, ఆదర్శనగర్, చంద్రనగర్, ఖర్వేల్ నగర్, సంతోష్‌నగర్, ఎల్లపువానిపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో అన్నదానం

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో కార్తీకేయ శరవణ ట్రస్టు ఆలయ ధర్మకర్త దేవాల రాజు(కృష్ణ) ఆధ్వర్యంలో బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణ శర్మ నేతృత్వంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు దేవాల రాజు అన్నదానాన్ని ప్రారంభించారు. సుమారు 3 వేల మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపా రు. సాయంత్రం సుబ్రహ్మణ్య స్వామికి ఇడిం పూజ లు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వైస్ చైర్మన్ చొక్కాకుల కుమారి, కడగల జ్యోతీష్, కార్యదర్శి కాండ్రేగుల రాము, కె.త్రివేణి, కె.సురేష్ కిరణ్‌కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అన్నప్రసాద వితరణలో నిర్వాహకులు

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకొని ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకం జరిపించారు. శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ అధ్యక్షులు ఐ. నాగేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కమిటీ కార్యదర్శి ఎం. శ్రీనివాసరాజు, కోశాధికారి డి. సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు రవి శంకర్, సభ్యులు జగన్నాథరావు పాల్గొన్నారు.

సంక్షేమ రాజ్యం వైఎస్సార్ సీపీతోనే సాధ్యం



ప్రచారం నిర్వహిస్తున్న శ్రీధర్, కృష్ణ

విశాఖ విద్య: సంక్షేమ రాజ్యం కావాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్. కృష్ణ (అల్లా కృష్ణ) అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని 52వ వార్డు శాంతినగర్‌లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాలనీలో ఇంటింటికీ తిరిగి వైఎస్సార్ అభ్యర్థులను తమ అమూల్యమైన ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. డిప్యూటీ మేయర్ శ్రీధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ మాట్లాడుతూ నియోజవర్గం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్ కుమార్, ఎంపీగా బొత్స ఝాన్సీలను గెలుపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో 52వ వార్డు పార్టీ నాయకుడు జియ్యాని మారుతీ తదితరులు పాల్గొన్నారు.

10న నేషనల్ టెక్నాలజీ డే పోటీలు

గోపాలపట్నం: నేషనల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లాబొరేటరీ (ఎన్ఎస్‌టీఎల్)లో మే10 డీఆర్‌డీవో ఆధ్వర్యంలో నేషనల్ టెక్నాలజీ డే నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యార్థులకు వివిధ ప్రాజెక్టులపై పోటీలు నిర్వహించనున్నామని ఎన్ఎస్టీఎల్ నేషనల్ టెక్నాలజీ నిర్వాహక కమిటీ తెలిపింది. నేషనల్ టెక్నాలజీ డే సెలబ్రేషన్స్ (ఎన్‌టీడీసీ)-2024లో భాగంగా నిర్వహించే పోటీల్లో డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, పాఠశాల స్థాయిలో 9, 10వ తరగతి విద్యార్థుల కోసం పలు కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఎన్ఎస్టీఎల్‌లో నమూనాల పోటీలు ప్రదర్శన జరుగుతుందని కమిటీ సభ్యులు వివరించారు. వివరాలకు 0891-2586396, 0891 25866415, 9032322136 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గణబాబుకు ఝలక్

టీడీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి గణబాబుకు జనం ఝలక్ ఇచ్చారు. బుధవారం ఆయన నామినేషన్ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. టీడీపీ మార్క్ రాజకీయ ట్రిక్కులూ ప్లే చేశారు. ఆటోలకు డీజిల్, నగదు, బిర్యానీ వంటి తాయిలాల ఎర వేశారు. నామినేషన్ ఘట్టంతో సత్తా చాటుకోవాలని గణబాబు భావించారు. అయితే గణబాబు శైలి, ఆయన వాడుకునే విధానం తెలిసిన జనం అన్నీ తీసుకుని నామినేషన్ కార్యక్రమం మధ్యలోనే వెనుదిరిగారు. దీంతో టీడీపీ అనుచరులకు మైండ్ బ్లాక్ అయింది. నామినేషన్ కార్యక్రమం చప్పగా సాగింది. ఏదో అనుకుంటే మరేదో అవడంతో టీడీపీ ఢీలా పడింది.

- నామినేషన్‌కు జనం లేక దిగాలు
- ఒక్కొక్కరికి రూ.400 ప్లస్ బిర్యానీ
- అందుకుని మధ్యలోనే వెళ్లిపోయిన అనుచరులు
- ఢీలాపడ్డ తెలుగు తమ్ముళ్లు



టీడీపీ టోపీతో ఎన్ఏడీ మద్యం దుకాణం వద్ద క్యూ కట్టిన టీడీపీ కార్యకర్తలు



ర్యాలీ మధ్యలోనే వెనుదిరిగిన మహిళలు



ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్సులు, వాహనాలు



రహదారి మధ్యలో క్రేన్‌తో ట్రాఫిక్ జామ్

విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గణబాబు నామినేషన్ కార్యక్రమానికి ప్రజాదరణ కరువైంది. నామినేషన్ దాఖలు చేసే క్రమంలో బుధవారం గణబాబు ర్యాలీ నిర్వహించారు. భారీ జనసమీకరణతో తమ ఉనికిని చాటుకోవాలనే ఎత్తుగడలో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా కాలనీ నుంచి డబ్బులు ఇచ్చి జన సమీకరణ చేసినట్లు పలువురు చెబుతున్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం బిర్యానీతో పాటు ర్యాలీలో పాల్గొనేవారికి రూ.400లు ఇస్తామని తీసుకొచ్చారని కొంత మంది బాహాటంగానే చెప్పడం గమనార్హం. అదేవిధంగా ఆటోతో వచ్చిన వారికి డీజిల్, రూ.500లు ఇచ్చినట్లు చెబుతున్నారు. గోపాలపట్నం నుంచి జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోనల్ కార్యాలయం వరకు ర్యాలీలో పాల్గొనాలని తాయిలాల ఒప్పందాలు చేసుకున్నా, చాలా మంది ర్యాలీ మధ్యలోనే బై..బై చెప్పేసి మెల్లగా జారుకున్నారు. చాలా మంది మహిళలు ర్యాలీ నుంచి వెనుతిరుగటం కనిపించింది. కొంతమంది టీడీపీ చోటామోటా నాయకులు మద్యం దుకాణాల వద్ద కనిపించారు.

అడుగడుగునా కోడ్ ఉల్లంఘన

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గణబాబు అడుగుడుగునా కోడ్ ఉల్లంఘించారు. నిబంధనలు అతిక్రమించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్వహించే శిక్షణ సంస్థ విద్యార్థినులతో సైతం నామినేషన్ ర్యాలీలో డ్యాన్సులు వేయించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. గోపాలపట్నంలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన(డీడీయు-జీకేవై) కేంద్రంలో శిక్షణ కోసమని వచ్చిన యువతులను తీసుకొచ్చారు. కేంద్రం నిర్వాహకులే వారందరినీ తీసుకురావడం గమనార్హం. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మల్లికార్జున విచారణ జరిపించి, చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ట్రాఫిక్‌కు విఘాతం

గణబాబు నామినేషన్ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారు. గోపాలపట్నం నుంచి జ్ఞానాపురంలోని రిటర్నింగ్ కార్యాలయం (జీవీఎంసీ జోనల్ కార్యాలయం) వరకూ టీడీపీ శ్రేణులు వాహనాల ర్యాలీ చేశారు. ర్యాలీలో వాహనంపై ఉన్న ఎమ్మెల్యే అభ్యర్థి గణబాబు, ఎంపీ అభ్యర్థి భరత్‌కు గజమాల వేసే క్రమంలో మర్రిపాలెం వద్ద రహదారి మధ్యలో భారీ క్రేన్ ఉంచారు. అభ్యర్థులిద్దరికీ గజమాల వేసి అనంతరం క్రేన్ పక్కకు తిప్పే క్రమంలో ఇరువైపులా వాహనాలు రావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మర్రిపాలెం రైల్వే స్టేషన్ ముందు నుంచి ఎన్ఏడీ వైపుకు దుర్గాలమ్మ-బంగారమ్మ ఆలయం వరకు గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. మధ్యలో కొన్ని వాహనాలు డివైడర్లపైకి ఎక్కాయి. ట్రాఫిక్‌లో మహాప్రస్థానం అంబులెన్స్, అదే విధంగా మరో ప్రైవేటు ఆస్పత్రికి సంబంధించిన అంబులెన్స్ చిక్కుకున్నాయి. అక్కడ విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులు సైతం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

జోరుగా ఎన్నికల ప్రచారం



క్రాంతినగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పిల్లా రమాకుమారి



సింధియా గేటు వద్ద ప్రచారం చేస్తున్న పత్నీరావు

మల్కాపురం: సార్వత్రిక ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ గెలుపు కోసం పలు వార్డులలో విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు జరిగాయి.దీనిలో భాగంగా 63వ వార్డు పరిధి క్రాంతినగర్ ప్రాంతంలో బుధవారం ఉదయం, సాయంత్రం జరిగిన ప్రచార కార్యక్రమాల్లో యలమంచలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి పాల్గొని ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇంత కాలం ఎమ్మెల్యేగా చేసిన టీడీపీ అభ్యర్థి గణబాబు ఏనాడైన ప్రజలకు మంచి చేశాడా అని ప్రశ్నించారు. సంక్షేమం, అభివృద్ధి కావాలంటే వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలన్నారు. అందరికీ అందుబాటులో ఉండే వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌ను, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వార్డు పార్టీ ఇన్‌చార్జ్ పిలక రామ్మోహన్‌రెడ్డి , వార్డు పార్టీ అధ్యక్షుడు సోమాదుల సురేష్ , మాజీ కార్పొరేటర్ గల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే షిప్‌యార్డ్ గేటు పరిసర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు పత్నీరావు మహిళలతో కలిసి ఆడారి ఆనంద్ గెలుపు కోసం ప్రచారం చేశారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన యువతతో ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, గొల్లవీధి ప్రాంతానికి చెందిన పలువురు యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. 59వ వార్డు నక్కవానిపాలెం పార్టీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం గొల్లవీధికి చెందిన యువకులు పార్టీ చేరగా..వారికి పార్టీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీ పశ్చిమ ఎన్నికల పరిశీలికురాలు పీలా ఉమారాణి, వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ పాల్గొన్నారు.

టీడీపీ తాయిలాల 'దుకాణం'

- రోడ్డును ఆక్రమించి దుకాణాల నిర్వహణ
- ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు స్కెచ్
- ఎన్నికల వేళ పట్టించుకోని అధికారులు



పాఠశాల గేటు ముందు ఉన్న దుకాణాలు



పాఠశాల ప్రహరీకి ఆనుకొని రహదారిపైనే ఉన్న దుకాణాలు

విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గంలో ఫ్యాన్ గాలి జోరుగా వీస్తోంది. వైఎస్సార్ సీపీ నుంచి ఎమ్మెల్యేగా బరిలో పోటీ చేస్తున్న ఆడారి ఆనంద్ కుమార్‌కు అన్నివర్గాల నుంచి ఆదరణ లభిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, కష్టమని వచ్చిన వారికి చేతికి సాయం అందించటంలో ముందుండే ఆడారి ఆనంద్ కుమార్ సేవా కార్యక్రమాలతో ఈ సారి పశ్చిమంలో జెండా ఎగురవేయటం ఖాయమని వైఎస్సార్‌సీపీ శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో ప్రచారంలో దూసుకెళుతున్నారు

టీడీపీకి అంతటా వ్యతిరేకత..

రెండుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించినా ఆపద అని వెళ్లిన వారిని గణబాబు ఆమడదూరంలో పెడతారని ఆ పార్టీకి చెందిన నాయకులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఇదేవిషయాన్ని కొంతమంది టీడీపీ నాయకులు పత్రికా సమావేశాలు సైతం ఏర్పాటు చేసి గణబాబు తీరును ఎండగట్టారు. ఇంటా, బయట వ్యతిరేకత కూడగట్టుకున్న గణబాబు ఎలాగైనా మూడోసారి ఎమ్మెల్యే గిరి దక్కించుకోవాలని అడ్డదారులు తొక్కేందుకు స్కెచ్ వేస్తున్నారనే ప్రచారం నియోజకవర్గంలో జోరుగా సాగుతుంది.

ఎన్నికల ప్రచారంలో వెనుకబడటంతో పాటు, ప్రజాదరణ కూడా సరిగా లేకపోవటంతో టీడీపీ అభ్యర్థి గణబాబు అంతర్మథనంలో పడ్డారు. దీంతో ఎన్నికల క్యాడర్లకు తాయిలాలు పంచుతూ, ఎన్నికల రోజు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి తమకు అనుకూలంగా ఓటు వేయించుకునేందుకు కుయుక్తులు పన్నుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. 52వ వార్డులోని కరాసలో జరుగుతున్న తతంగం ఇందుకు తార్కాణంగా నిలుస్తోంది.

అంతా అక్కడ నుంచే

పశ్చిమ నియోజకవర్గంలోని 52వ వార్డు కరాస జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో 214,215, 216, 217, 234 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ 58-9 లో 1 నుంచి 111 ఇళ్లు అదే విధంగా 58-10లో 1 నుంచి 124 ఇళ్లల్లో ఉన్న ఓటర్లు, అలాగే 58-11 లో 1 నుంచి 108 అదే విధంగా 118 నుంచి 185 డోర్ నంబర్లలో ఉన్న ఓటర్లు ఇక్కడి పోలింగ్ స్టేషన్లలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పాఠశాల ప్రహరీకి ఆనుకొని స్థలాలను ఆక్రమించి కొందరు షాపులు నిర్వహిస్తున్నారు. ఇందులో ఓ షాపు టీడీపీకి చెందిన వ్యక్తిది. ఆ నాయకుడి కనుసన్నల్లో దుకాణాలు నిర్వహణ సాగుతున్నాయి. టీడీపీ ఎన్నికల ప్రచారంపై కూడా ఇదే చోట సమీక్షలు చేస్తున్నారని, ప్రభుత్వ పాఠశాల, అందులోనూ పోలింగ్ స్టేషన్ వద్ద రాజకీయాలేంటని పలువురు అంటున్నారు. వీటిని అక్కడ నుంచి తొలగించాలని స్థానికులు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ తక్షణమే దీనిపై స్పందించాలని వారు కోరుతున్నారు.